

మహిళా ఓటర్లపైనే అన్ని పార్టీల గురి!

● ప్రత్యేక పథకాలు ఆదుకుంటాయా?

ప్యారీస్, మార్చి 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బడిముబ్బడిగా అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలను ఆదుకుంటాయా అన్నదానిపై విస్తృత చర్చ ప్రారంభమైంది. మరో నెల రోజుల్లో రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై అన్ని వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఏప్రిల్ 19న ఒకే విడతగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష, బీజేపీ కూటముల మధ్య నియోజకవర్గాల కేటాయింపు, పొత్తులపై అవగాహన, ఏఏ స్థానాల్లో ఎవరెవరు పోటీ చేస్తారన్న అంశాల నేపథ్యంలో 39 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే కీలక నిర్ణయేతలు మహిళా ఓటర్లుగా ఉన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 6.18 కోట్ల మంది ఓటు హక్కు కలిగి వున్నారు. వీరిలో అత్యధికులు మహిళా ఓటర్లే కావడం విశేషం. అందువల్ల మహిళా ఓటు బ్యాంక్‌పై కన్నేసిన రాజకీయపార్టీలు వారి కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాయి. మరో వారం రోజుల్లో మహిళల మనసు చూరగొనేలా ఎన్నికల మేనిఫెస్టోలు కూడా ఆయా పార్టీలు విడుదల చేయనున్నాయి.

అధికార డీఎంకే...

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారపార్టీగా కొనసాగుతున్న డీఎంకే, మహిళల సంక్షేమం కోసం పలు ప్రత్యేక పథకాలను పరిచయం చేసింది. కలైంజర్ గృహిణుల హక్కు పథకం కింద 1.15 కోట్ల మంది మహిళలకు ప్రతినెలా రూ.1,000 సాయం పంపిణీ జరుగుతోంది. విడియల్ ప్రయాణం అనే పేరుతో మహిళలు, హిజ్రాలు ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అంతేకాకుండా పుదుమై పెణ్ పథకం కింద నెలకు కళాశాల విద్యార్థినులకు ప్రోత్సాహక నిధిగా రూ.1,000, మహిళా స్వయం సహాయక బృందాలకు బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీ తదితర పథకాలను డీఎంకే ప్రభుత్వం విజయవంతంగా కొనసాగిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం...

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా డీఎంకే ప్రభుత్వానికి దీటుగా మహిళల కోసం ఆకర్షణీయమైన పథకాలు అమలు చేస్తోంది. 'పొగరహిత వంటలు' అనే పేరుతో దేశవ్యాప్తంగా పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు అన్ని గ్రామాల్లో పైపుల ద్వారా తాగునీటి వసతి కల్పిస్తోంది. మహిళలు తమ కాళ్లపై నిలబడేలా చిన్న పరిశ్రమలు ప్రారంభించడానికి రుణ వసతి పొందేలా పలు పథకాలన అమలుపరుస్తోంది.

కాంగ్రెస్...

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని అధికారంలో కూర్చోబెట్టాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ కూడా మహిళల కోసం సంక్షేమ పథకాలను, వారి జీవనశైలి మెరుగుపడేలా పథకాలు అందిస్తామని హామీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, డీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే తదితర పార్టీలు విజయానికి కీలకంగా భావిస్తున్న మహిళా ఓటు బ్యాంక్‌ను సొంతం చేసుకోవాలని ఆ దిశగా ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఏదిఏమైనప్పటికీ, వచ్చే జూన్ 4వ తేది జరగనున్న ఓట్ల లెక్కింపు రోజు మహిళా ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలిచారన్న స్పష్టత ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కోవైలో అట్టహాసంగా మోదీ రోడ్‌షో

● దారి పొడవునా పార్టీ శ్రేణుల పూలవర్షం ● బాంబు పేలుళ్ల మృతులకు పుష్పాంజలి

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తొలిసారిగా వాణిజ్య నగరం కోయంబత్తూరుకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి అపూర్వ స్వాగతం లభించింది. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు కోవై అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన మోదీకి పార్టీ ప్రముఖులు, సీనియర్ నేతలు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి కారులో బయలుదేరి కోయంబత్తూరు సాయిబాబా కాలనీకి చేరుకున్నారు. అక్కడి నుండి ఓపెన్‌టాప్ కారులో రోడ్‌షో చేపట్టారు. ధోవతి పైజామా ధరించిన మోదీ పార్టీ రంగులు, చిహ్నం కలిగిన టవల్‌ను అంగవస్త్రంలా వేసుకుని ఇరువైపులా ఉన్న కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేస్తూ బయలుదేరారు. మోదీకి ఓ వైపు కేంద్ర మంత్రి మురుగన్, మరో వైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, వెనుకవైపు బీజేపీ శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్ నిలిచారు. సాయిబాబా కాలనీ నుండి మెల్లగా మోదీ కారు బయలుదేరింది. దారికి ఇరువైపులా బీజేపీ కార్యకర్తలు, ఆ పార్టీ మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు చేత జెండాలు పట్టుకుని 'మోదీ.. మోదీ' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అదే సమయంలో దారిపొడవునా మోదీపై పూల వర్షం కురిపించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా బీజేపీ ఆధ్వర్యంలో అక్కడక్కడా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను మోదీ ఆసక్తిగా తిలకిస్తూ రోడ్‌షో కొనసాగించారు. ఈ రోడ్‌షో ఆర్ఎస్‌పురం ప్రాంతంలో తపాలా కార్యాలయం కూడలి వరకూ కొనసాగింది. సుమారు గంటకు పైగా ఈ రోడ్‌షో జరిగింది. మోదీ ప్రయాణించిన ఓపెన్‌టాప్ కారు వెనుకనే భద్రతాదళం వాహనాలు సాగాయి. ఆర్ఎస్‌పురం వద్ద 1998లో కోయంబత్తూరులో జరిగిన బాంబు పేలుళ్లలో మృతి చెందినవారి చిత్రపటాల వద్ద పుష్పాంజలి ఘటించారు.

భారీ భద్రత

రోడ్‌షోకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. షో ప్రారంభం కావటానికి రెండు గంటల ముందే సాయిబాబా కాలనీ నుంచి ఆర్ఎస్‌పురం తపాలా కార్యాలయం వరకు సుమారు 3.5 కి.మీ. దూరం దాకా మీటర్‌కు కానిస్టేబుల్ చొప్పున ఇరువైపులా నిలిచి జనాన్ని కట్టుదిట్టం చేస్తూ వచ్చారు. మోదీ వాహనంపై చల్లేందుకు అక్కడక్కడా బుట్టలలో ఉంచిన చామంతి పూలను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రహదారికి ఇరువైపులా నిలిచిన వేలాదిమంది కార్యకర్తలు, స్థానిక ప్రజలు మోదీని దగ్గరగా చూడటానికి ఆసక్తి కనబరిచారు. రహదారికి ఇరువైపులా ఏర్పరచిన బ్యారికేడ్లను ఆనుకుని వేల సంఖ్యలో ప్రజలు నిలిచారు. వారి వెనుక పార్టీ శ్రేణులు మోదీ వాహనాన్ని అనుసరించేలా ముందు వైపుకు వేగంగా పరుగులు తీశారు. మోదీ మోదీ అంటూ నినాదాలు చేస్తూ పరుగెత్తుతున్న వారిని అదుపుచేయడం పోలీసులకు కష్టమైంది. రోడ్‌షో ముగిసిన తర్వాత ప్రధాని మోదీ కోయంబత్తూరులోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేశారు.



రోడ్ షోలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

నేడు సేలంలో బహిరంగసభ

సేలంలో మంగళవారం మధ్యాహ్నం జరగనున్న బీజేపీ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో మోదీతో పాటు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ పాల్గొననున్నారు. సోమవారం సాయంత్రం కోయంబత్తూరులో రోడ్‌షో నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఉదయం అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి కేరళలోని పాలక్కాడుకు వెళతారు. అక్కడ ఉదయం 11.40 గంటలకు జరిగే ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొంటారు. ఆ సమావేశం ముగిశాక హెలికాప్టర్‌లో సేలం నగరానికి విచ్చేయనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సేలం సమీపం గెజ్జల నాయకన్‌పట్టి వద్ద 44 ఎకరాల్లో ఏర్పాటయ్యే బీజేపీ కూటమి ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారు. సేలం, నామక్కల్, కరూరు లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ సభకు హాజరుకానున్నారు. ఈ సభలో మోదీతోపాటు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్ ప్రసంగించనున్నారు. వీరితోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్రమంత్రి మురుగన్, టీఎంసీ నేత జీకే వాసన్, న్యూజస్టిస్ పార్టీ నేత ఏసీ షణ్ముగం, ఐజేకే నాయకుడు పారివేందర్ తదితరులు హాజరువుతున్నారు. ఈ సమావేశానికి లక్ష మందిని తరలించేందుకు బీజేపీ స్థానిక నాయకులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ సభ చుట్టూ సుమారు రెండువేల మంది పోలీసులతో భద్రత కల్పించనున్నారు.

గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలి

● డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్

ప్యారీస్, మార్చి 18: సుప్రీంకోర్టు తీర్పును కించిత్తయినా గౌరవించని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని వెంటనే రీకాల్ చేయాలని డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గవర్నర్ రవి భారత రాజ్యాంగ చట్టాన్ని గౌరవించడం లేదని, అక్రమార్జన కేసులో మాజీ మంత్రి పొన్ముడికి విధించిన శిక్షను న్యాయస్థానం నిలిపివేసిందని, ఇందువల్ల పొన్ముడిచే మళ్లీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ గవర్నర్‌కు లేఖ రాశారని గుర్తు చేశారు. అయితే పొన్ముడిచే మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించడం సాధ్యం కాదని గవర్నర్ చెప్పడం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ముఖ్యమంత్రి సిఫారసు చేసే ఒక ఎమ్మెల్యే మంత్రి కావాలా, వద్దా అని నిర్ణయం తీసుకొనే హక్కు గవర్నర్‌కు లేదని, అయినా ఈ వ్యవహారంలో ఆయన మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇదంతా ముఖ్యమంత్రి అభీష్టానికి, మంత్రి వర్గ నిర్ణయానికి వ్యతిరేకమైన చర్యలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేసే ప్రతిపాదనలను ప్రశ్నించే అధికారం గవర్నర్‌కు లేదని పేర్కొంటూ దీనిపై గతంలో సుప్రీంకోర్టు చేసిన తీర్పులను ఉదహరించారు. గవర్నర్ రవి బీజేపీ నేతగానే వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రచార మాధ్యమాల దృష్టి ఆకట్టుకొనేందుకు గవర్నర్ ఎల్లప్పుడూ ఆరాటపడుతుంటారన్నారు. ప్రభుత్వంతో గవర్నర్ వ్యవహరిస్తున్న ఘర్షణాత్మక ధోరణి మానుకోవాలని ఆ ప్రకటనలో హితవు పలికారు.



డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్

డీఎంకే కూటమిలో ముగిసిన నియోజకవర్గాల కేటాయింపు

● కాంగ్రెస్‌కు 3 కొత్త స్థానాలు ● ఎండీఎంకేకి తిరుచ్చి సీటు



నియోజకవర్గాల కేటాయింపుపై కుదిరిన ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో మిత్రపక్షాలు పోటీ చేయనున్న నియోజకవర్గాల జాబితా ఖరారైంది. ఈ కూటమిలోని ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు తిరువళ్లూరు (రిజర్వుడు), కడలూరు, మైలాడుదురై, శివగంగ, తిరునల్వేలి, కృష్ణగిరి, కరూరు, విరుదునగర్, కన్నియాకుమారి, పుదుచ్చేరి నియోజకవర్గాలను కేటాయించారు.



అరివాలయం వెలుపల మీడియా సమావేశంలో నియోజవర్గాల జాబితాను ప్రదర్శిస్తున్న సెల్వపెరుందగై

ఈ మేరకు సోమవారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై మధ్య ఒప్పందం కుదిరింది. గతంలో కాంగ్రెస్ పోటీ చేసి గెలిచిన ఆరణి, తేని, తిరుచ్చి నియోజకవర్గాలకు బదులుగా ఈసారి తిరునెల్వేలి, కడలూరు, మైలాడుదురైలను డీఎంకే అధిష్ఠానం కేటాయించింది. తిరుచ్చికోసం ఎండీఎంకే నేత వైగో పట్టుబట్టడంతో డీఎంకే ఆ నియోజకవర్గాన్ని ఆ పార్టీకి కేటాయించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎస్.తిరునావుక్కరసు పోటీ చేసి గెలిచిన తిరుచ్చి నియోజకవర్గంలో వైగో తనయుడు దురై వైగో పోటీకి దిగనున్నారు. ఇదే విధంగా ఆరణిలో విష్ణు ప్రసాద్ పోటీ చేసి గెలిచారు. ఈ నియోజకవర్గానికి బదులుగా కాంగ్రెస్‌కు కేటాయించిన కడలూరులో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి పోటీ చేసే అవకాశం ఉంది. ఇక గత ఎన్నికల్లో తేని నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఈవీకేఎస్ ఇళంగోవన్ అన్నాడీఎంకే తరఫున పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం తనయుడు రవీంద్రనాథ్ చేతిలో ఓటమిపాలయ్యారు. తేని నియోజకవర్గానికి బదులుగా కేటాయించిన తిరునెల్వేలిలో ముఖ్యమంత్రి స్టాలిన్ సన్నిహితుడైన రాష్ట్ర మైనార్టీల సంఘం అధ్యక్షుడు పీటర్ అల్ఫోన్స్ పోటీ చేసే అవకాశం ఉంది. ఇక కూటమిలోని సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే, కొంగునాడు మక్కల్ కట్చి, ముస్లింలీగ్ పార్టీలకు ఇటీవలే నియోజకవర్గాల కేటాయింపులు పూర్తయ్యాయి. ఆ ప్రకారం తిరుచ్చి సీటును ఎండీఎంకేకు, నాగపట్టినం, తిరుప్పూరు నియోజకవర్గాలను సీపీఐకి, మదురై, దిండుగల్ నియోజకవర్గాలను సీపీఎంకు, విల్లుపురం, చిదంబరం నియోజకవర్గాలను డీపీఐకి, రామనాథపురం నియోజకవర్గాన్ని ముస్లింలీగ్‌కు, నామక్కల్ నియోజకవర్గాన్ని కొంగునాడు ముక్కల్ కట్చికి కేటాయించారు. ఈ పార్టీ డీఎంకే చిహ్నం ఉదయించే సూర్యుడు గుర్తుపై పోటీ చేయనుంది. సీపీఎం తరఫున మదురైలో వెంకటేశన్, దిండుగల్‌లో సచ్చిదానందం పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ ఇటీవల అధికారికంగా ప్రకటించింది. ఇక సోమవారం జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ తిరుప్పూరు, నాగపట్టినం నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సమక్షంలో ప్రకటించారు. ఆ మేరకు తిరుప్పూరులో సుబ్బరాయన్, నాగపట్టినం (రిజర్వుడు)లో సెల్వరాజ్ పోటీ చేయనున్నారు. ఇక రామనాథపురంలో ముస్లింలీగ్ నేత నవాజ్‌ఘనీ పోటీ చేయనున్నారు. ఇలా మిత్రపక్షాలకు నియోజకవర్గాల కేటాయింపు పూర్తి కావడంతో మిగిలిన 21 నియోజకవర్గాల్లో డీఎంకే పోటీ చేయనుంది. ఈ నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ఎంపిక కూడా దాదాపు పూర్తయ్యింది. త్వరలోనే అభ్యర్థుల జాబితాను విడుదల చేయనుంది. ఉత్తరచెన్నైలో కళానిధి వీరాసామి, దక్షిణచెన్నైలో తమిళచ్చి తంగపాండ్యన్, సెంట్రల్ చెన్నైలో దయానిధి మారన్, శ్రీపెరుంబుదూరులో టీఆర్ బాలు, అరక్కోణంలో జగద్రక్షగన్, వేలూరులో కదిర్ ఆనంద్, తూత్తుకుడిలో కనిమొళి మళ్లీ పోటీ చేసే అవకాశం ఉంది.

డీఎంకే పోటీ చేయనున్న నియోజకవర్గాలివే...


1. ఉత్తర చెన్నై, 2. దక్షిణ చెన్నై, 3. సెంట్రల్ చెన్నై, 4. శ్రీపెరుంబుదూరు, 5. కాంచీపురం, 6. వేలూరు, 7. అరక్కోణం, 8. తిరువణ్ణామలై, 9.ఆరణి, 10. కళ్లకురిచ్చి, 11. ధర్మపురి, 12. కోయంబత్తూరు, 13. పొల్లాచ్చి, 14. సేలం, 15. ఈరోడ్, 16.నీలగిరి, 17. తంజావూరు, 18. పెరంబలూరు, 19. తేని, 20. తెన్‌కాశి, 21. తూత్తుకుడి.

మే మొదటి వారం నుంచి ఇంజనీరింగ్ అడ్మిషన్లు

పెరంబూర్, మార్చి 18: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు మే మొదటి వారంలో చేపట్టాలని ఉన్నత విద్యాశాఖ నిర్ణయించింది. మే మొదటి వారం నుంచి నెల రోజులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మే 12వ తేది విడుదల కానున్న నేపథ్యంలో, అంతకు ముందుగానే దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రభుత్వ వాటాలో మొత్తం 2 లక్షల సీట్లున్న విషయం తెలిసిందే.

రంజాన్ వేళలు

మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.26
బుధవారం : సహర్ : ఉదయం -4.33



ఎన్నికలు, ఎండల ఎఫెక్ట్ పాఠశాల పునఃప్రారంభం వాయిదా?



చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు లోక్‌సభ ఎన్నికలు, మరో వైపు వేసవి ఎండలు అధికం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలో పాఠశాలల పునః ప్రారంభాన్ని మరి కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని పాఠశాలల విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్లస్-1, ప్లస్-2 పబ్లిక్ పరీక్షలు ఈనెల 25లోగా ముగియనున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడి కానున్నాయి. ఈ పరిస్థితుల్లో మే, జూన్ నెలలో ఎండ వేడిమి కూడా అధికంగా ఉంటుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న పాఠశాలల విద్యాశాఖ జూన్ 1నుండి ప్రారంభించాల్సిన పాఠశాలలను రెండోవారంలో తెరవాలని భావిస్తోంది. ఈ మేరకు త్వరలో అధికారిక ప్రకటన విడుదల కానుంది.

హాట్ కేకుల్లా ఐపీఎల్ టిక్కెట్లు

● నిమిషాల్లోనే ముగిసిన విక్రయాలు

అడయార్, మార్చి 18: ఐపీఎల్ టిక్కెట్లు హాట్ కేకుల్లా విక్రయమయ్యాయి. ఆన్‌లైన్‌లో విండో ఓపెన్ కాగానే క్షణాల్లో అయిపోయాయి. ఈనెల 22నుంచి ఐపీఎల్ 2024 సీజన్ పోటీలు ప్రారంభంకానున్నాయి. ఈ పోటీల్లో భాగంగా నగరంలోని చిదంబరం స్టేడియంలో ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ఇందులో చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ఈ పోటీల కోసం సోమవారం ఉదయం కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే టిక్కెట్లను విక్రయించారు. ఈ ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయ విండో ఓపెన్ చేయగానే క్షణాల్లో హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఒక వ్యక్తికి రెండు టిక్కెట్లు మాత్రమే విక్రయించారు. అయినప్పటికీ.. ఈ విక్రయం ప్రారంభమైన వెంటనే అమ్ముడుపోయినట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మ్యాచ్ కోసం స్టేడియంలోని సీ, డీ, ఈ గ్యాలరీల్లోని కింది భాగం టిక్కెట్లను రూ.1700, ఈ మూడు గ్యాలరీల్లోని ఎగువభాగం టిక్కెట్లను రూ.4 వేలుగా నిర్ణయించారు. అయినప్పటికీ ఆ టిక్కెట్లు కూడా హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. ఐ, జే, కే గ్యాలరీల్లోని కింది భాగం టిక్కెట్ల ధరను రూ.4500, ఈ గ్యాలెరీల్లోని ఎగువ భాగం సీట్లకు సంబంధించిన టిక్కెట్ల ధరను రూ.4000గా నిర్ణయించారు. కలైంజర్ కరుణానిధి గ్యాలరీ టిక్కెట్ల ధరను రూ.7500కు విక్రయించారు. ఈ మ్యాచ్ ప్రారంభంరోజున స్టేడియంలోకి ప్రేక్షకులను సాయంత్రం 4.30 గంటల నుంచి అనుమతిస్తామని చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.



చెపాక్ స్టేడియం

సమాచార దర్శిని

ముగిసిన పూడికతీత పనులు

ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక నేపియర్ బ్రిడ్జి ముఖ ద్వారంలో పూడికతీత పనులు ముగిశాయి. ఐదు నెలల క్రితం ప్రారంభమైన పనులు ఆదివారం 90 శాతం పూర్తయ్యాయని, సముద్ర కోత అడ్డుకొనేలా నక్షత్రాకార రాళ్లను కంచెగా ఏర్పాటు చేశామని, మిగిలిన 10 శాతం పనులు త్వరలో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

రూ.15 కోట్లతో పార్కు

ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక కోయంబేడు పూల మార్కెట్లో రూ.15 కోట్లతో పార్కు ఏర్పాటుకానుంది. మార్కెట్ ప్రాంగణంలోని కాళియమ్మన్ ఆలయం రోడ్డు, ఏ బ్లాక్ రోడ్డు పక్కన ఎల్ ఆకారంతో ఉన్న 8.5 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయడానికి సీఎండీఏ నిర్ణయించింది. నిర్మాణ పనులకు అంతరాయం కలగకుండా మార్కెట్లోని బీసీడీ బ్లాక్‌ల సమీపంలో వాహనాలు వచ్చి వెళ్లేలా ట్రక్ వే ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు పూర్తికాగానే పార్కు నిర్మాణపనులు చేపడతామని సీఎండీఏ అధికారులు తెలిపారు.

28న తపాలా గ్రీవెన్స్

ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక అన్నాసాలైలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ నెల 28వ తేది సాయంత్రం 3 గంటలకు తపాలా గ్రీవెన్స్ జరగనుంది. 25వ తేదిలోపు వినియోగదారులు ఫిర్యాదులు పంపించాలని అధికారులు పేర్కొన్నారు. పోస్టల్ సంబంధిత ఫిర్యాదుల్లో పోస్ట్ చేసిన తేది, సమయం వంటి వివరాలు పేర్కొనాలని, పొదుపు ఖాతాకు సంబంధించిన ఫిర్యాదుల్లో అన్ని వివరాలు పేర్కొనాలని సూచించారు. ఫిర్యాదులను తపాలా గ్రీవెన్స్ ప్రకాష్, సీనియర్ పోస్టల్ ఆఫీసర్, అన్నాసాలై, చెన్నై-2 అనే చిరునామాకు పంపించాలన్నారు.

రేపు విజయ యాత్ర స్వాగతోత్సవాలు

ఐసీఎఫ్, మార్చి 18: కాంచీపురంలో బుధవారం విజయ యాత్ర స్వాగతోత్సవాలు జరగనున్నాయి. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి 2022 మార్చిలో విజయ యాత్రగా రామేశ్వరం, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలకు విజయం చేశారు. అయోధ్య రామజన్మ భూమి కుంభాభిషేకం, ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్నారు. తమ విజయ యాత్రను పూర్తిచేసుకొని ఈనెల 20వ తేది కాంచీపురం శంకర మఠానికి రానున్నారు. ఈ సందర్భంగా స్వామికి మఠం, వివిధ ఆధ్యాత్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయ యాత్ర స్వాగతోత్సవం బుధవారం సాయంత్రం 5 గంటలకు సర్వతీర్థం సమీపంలో నిర్వహించనున్నారు. వివిధ ఆలయాల ప్రసాదాలతో, పూర్ణకుంభ మర్యాదలతో పరమాచార్యులకు స్వాగతం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులకు విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు అందజేసి ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

రూ.69 కోట్లతో తాగునీటి పైప్‌లైన్

ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక షోళింగనల్లూర్ మండలంలో రూ.69.57 కోట్లతో తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. కన్నగినగర్‌లోని హౌసింగ్ బోర్డు గృహాలకు తాగునీరు సరఫరా చేసేలా ఈ పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 35 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించనున్నారు. రోజుకు 6 మిలియన్ లీటర్లు సరఫరా చేయనున్నామని, ఈ పథకం ద్వారా లక్షమంది లబ్ధిపొందనున్నారని మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు.

హుబ్లీ - రామేశ్వరం మధ్య ప్రత్యేక రైలు

ఐసీఎఫ్, మార్చి 18: కర్ణాటక రాష్ట్రం హుబ్లీ - రామేశ్వరం మధ్య వారాంతపు ప్రత్యేక రైలు ఏప్రిల్ 6 నుంచి జూన్ 30వ తేది వరకు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. హుబ్లీ నుంచి శనివారాల్లో ఉదయం 6.30 గంటలకు బయల్దేరే ఈ రైలు మరుసటిరోజు ఉదయం 6.15 గంటలకు రామేశ్వరం చేరుకుంటుంది. మరో మార్గంలో ఏప్రిల్ 7 నుంచి జూన్ 30వ తేది వరకు ప్రతి ఆదివారం రామేశ్వరం నుంచి రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 7.25 గంటలకు హుబ్లీ చేరుకుంటుంది. ఈ రైలు రామేశ్వరం నుంచి రామనాథపురం, మానామదురై, కారైక్కుడి, పుదుకోట, తిరుచ్చి, కరూర్, నామక్కల్, ధర్మపురి, హోసూరు, హరిహర్ మీదుగా హుబ్లీ చేరుకుంటుంది. ఈ రైలుకుగాను రిజర్వేషన్ సోమవారం ప్రారంభమైంది.

20 వరకు 'నీట్' సవరణలకు అవకాశం

ఐసీఎఫ్, మార్చి 18: యూజీ వైద్య కోర్సులకు నిర్వహించే నీట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుల్లో ఈనెల 20వ తేది వరకు సవరణలు చేయవచ్చని జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) తెలిపింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు దేశవ్యాప్తంగా నీట్ ఆధారంగా జరుగుతున్నాయి. ఈ ఏడాదికిగాను పరీక్ష తమిళం, ఆంగ్లం, హిందీ సహా 13 భాషల్లో మే 5వ తేది నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ఫిబ్రవరి 9న ప్రారంభమై ఈనెల 16వ తేదీతో ముగిసింది. దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, దరఖాస్తుల్లో సవరణలకు బుధవారం వరకు ఎన్టీఏ అవకాశం కల్పించింది. వివరాలకు నెం.011-40759000లో కానీ ఎన్టీఏ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

850 గృహాలకు డ్రైనేజీ కనెక్షన్లు

ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక కొళత్తూర్‌లో 850 గృహాలకు భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చినట్లు చెన్నై మెట్రో వాటర్ బోర్డు తెలిపింది. 2023 జనవరిలో రూ.19.56 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పథకం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు ఫిబ్రవరిలో పూర్తయ్యాయి. కొళత్తూర్ నియోజకవర్గం 64వ వార్డు పరిధిలోని వీనస్ నగర్, జయంతి నగర్, గణేశ్ నగర్, హార్బర్ కాలనీ, మల్లిగై అవెన్యూ, తిరువళ్లువర్ నగర్ ప్రాంతాల్లో తొలివిడతగా 850 గృహాలకు డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చారు.

రూ.1.50 కోట్లతో ఆధునిక దహన వాటిక


ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక మాధవరం మండలం 28వ వార్డు తిరువళ్లువర్ వీధిలో ఉన్న శ్మశానవాటికలో రూ.1.50 కోట్లతో ఆధునిక దహన వాటిక ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న ఈ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఆదివారం మాధవరం ఎమ్మెల్యే సుదర్శనం ప్రజల వినియోగం కోసం దహన వాటికను ప్రారంభించారు.

రూ.3 కోట్ల విలువైన స్థలం స్వాధీనం

ఐసీఎఫ్, మార్చి 18: స్థానిక తిరువొత్తియూర్‌లో ప్రైవేటు ఆక్రమణలో ఉన్న రూ.3 కోట్ల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరువొత్తియూర్ మండలం 4వ వార్డులో ప్రభుత్వం రూ.1.75 కోట్లతో 6,400 చదరపు అడుగుల్లో కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు నిర్ణయించింది. ఆ స్థలాన్ని ఆక్రమించిన ఓ వ్యక్తి దుకాణాలు ఏర్పాటుచేసి అద్దెకిచ్చాడు. సమాచారం తెలుసుకున్న మండల సహాయ కమిషనర్, అధికారులు వెళ్లి దుకాణాలు కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కీల్పాక్‌లో స్వయం సమృద్ధి ఆదర్శ గృహం

- కరెంట్, గ్యాస్, వాటర్ అన్నీ ఉచితం
- 'సోలార్' సురేష్ ప్రస్థానం


సోలార్ ప్యానెళ్లను చూపుతున్న సురేష్

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను ఉపయోగించుకుంటూ ఇంటికి అవసరమైన విద్యుత్‌ను, వంటగ్యాస్‌ను ఉత్పత్తి చేసుకుంటూ, వాననీటి సేకరణ ద్వారా యేడాది పొడవునా తాగునీటి కొరతకు తావులేని స్వయంసమృద్ధితో ఆదర్శ గృహాన్ని రూపొందించుకున్నారు చెన్నైకి చెందిన సురేష్. ఎనభైయేళ్లు దాటినా నవ్వుతూ చలాకీగా ఉండే ఆయన.. మద్రాసు ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్, అహ్మదాబాద్ ఐఐఎంలో ఎంబీఏ చదివిన సురేష్ టెక్స్‌టైల్ మార్కెటింగ్ విభాగాల్లో పనిచేసి, పలు ప్రైవేటు సంస్థల్లో ఉన్నతపదవులు పొంది 2015లో రిటైరయ్యారు. నగరంలోని కీల్పాక్ వాసు వీధిలో నివసిస్తున్న ఆయన్ను అందరూ 'సోలార్ సురేష్' అని పిలుస్తుంటారు. సురేష్ నివాసగృహాన్ని ఒక్కసారి సందర్శిస్తే చాలు ఎంత వరదొచ్చినా చుక్క నీరు చేరదనే విషయం అవగతమవుతుంది. వాననీటి సేకరణకు తొట్టి, సోలార్ ప్యానళ్లు, బయోగ్యాస్ ప్లాంట్, ఇంటి చుట్టూ ఉద్యానవనాన్ని తలపించేలా కూరగాయల మొక్కల పెంపకం, మిద్దెపై అందమైన గార్డెన్... ఆ ఇంట ప్రకృతి మాత తిష్ఠ వేసిందనే భావన కలగకమానదు. ప్రకృతిమాతకు జోహార్లు అర్పిస్తున్న సురేష్.. జాతీయస్థాయిలో పేరుగడించిన తన ఇంటి గురించి ఇలా వివరించారు...

విదేశీ మారకద్రవ్యం...

'విద్యుత్, ఇంధన ఉత్పత్తికి నేల బొగ్గు, పెట్రోలియం వంటి ముడిపదార్థాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వాటి కోసం భారీస్థాయిలో విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చుపెడుతున్నాం. నా ఇంటికి అవసరమైన విద్యుత్, వంటగ్యాస్‌ను ప్రకృతి సిద్ధంగా తయారు చేసుకుంటున్నా. నా వంతు విదేశీ మారకద్రవ్యం దేశానికి మిగిల్చినట్లే కదా' అంటూ నవ్వుతూ చెబుతుంటారు. ప్రకృతి వనరుల వినియోగంతో నాల్గు నేల తల్లికి ఎలాంటి ముప్పు జరగదనే భావన ఉంతో ఆనందాన్ని కలిగిస్తోందని చెప్పారు. సోలార్ విద్యుత్ తయారీ యూనిట్, బయోగ్యాస్, వాననీటి సేకరణ గురించి అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నానని చెబుతారు.

సోలార్ ప్యానెళ్లు...

కిలో వాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ.65 వేల దాకా ఖర్చవుతుందని చెబుతున్నారు సురేష్. నీడ పడకుండా నిత్యం సూర్యరశ్మి పడే 100 చదరపుటడుగుల స్థలంలో రోజుకు కనీసం నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఇక సోలార్ ప్యానళ్ల ద్వారా నేరుగా విద్యుత్‌ను పొందవచ్చని, అలాగే విద్యుత్‌ను బ్యాటరీలలో నిల్వ చేసి వినియోగించుకోవచ్చని చెప్పారు. సోలార్ ప్యానెళ్లను శుభ్రంగా ఉంచుకుంటే 25 యేళ్ల దాకా పనిచేస్తాయంటున్నారు. సోలార్ విద్యుత్‌ను నిల్వ చేయడానికి నాలుగు బ్యాటరీలు అవసరమవుతాయని, ఆ వ్యవస్థకు రూ.60 వేల దాకా ఖర్చవుతుందంటున్నారు. బ్యాటరీల్లో విద్యుత్‌ను నిల్వ చేసుకోవడం వల్ల మూడు రోజుల పాటు మబ్బు వేసుకున్నా విద్యుత్ అందుతుందంటున్నారు.

> కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ స్వయం సమృద్ధి ఆదర్శ నివాసగృహాన్ని పలుమార్లు సందర్శించారు. ప్రకృతి మాత అందిస్తున్న వనరులను సద్వినియోగపరచుకుంటున్న సురేష్‌ను పలు స్వచ్ఛంద సంస్థలు ఘనంగా సత్కరించాయి. ప్రస్తుతం ఇంటిపట్టునే సోలార్ విద్యుత్, బయోగ్యాస్, వాననీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడంపై అందరికి సలహాలు సూచనలను ఉచితంగా అందిస్తున్నారు.

సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి చేసుకునే విద్యుత్ ద్వారా లైట్లు, ఫ్యాన్‌లే కాకుండా ఇన్వర్టర్ ఏసీ, ఫ్రిజ్, కంప్యూటర్, టీవీ, మిక్సీ, లిఫ్ట్ పనిచేస్తాయి. అదే సమయంలో వాటర్ హీటర్, ఐరన్ బాక్స్, మైక్రోవేవ్ అవెన్లు పనిచేయవు. ఇవి పనిచేయాలంటే సోలార్ థర్మల్ ప్యానళ్లు అవసరమవుతాయి. ఈ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే ఆరేళ్లలో ఆ ప్లాంట్ కోసం చేసిన ఖర్చులు భర్తీ అవుతాయి.

వాననీటి సేకరణ...

ప్రస్తుతం అందరూ నీటిని డబ్బులిచ్చి కొంటున్నారు. వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోతాయి. నీటి కోసం వాటర్ ట్యాంకర్ లారీల కోసం ఎదురుచూస్తుంటారు. అయితే మా ఇంట నీటి కొరత లేదు. డబ్బిచ్చి వాటర్ బాటిళ్లను, క్యాన్ వాటర్‌ను కొనే ప్రసక్తేలేదు. ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న వాననీటి సేకరణతో యేడాది పొడవునా తాగునీటిని పొందుతున్నాం. వర్షాకాలంలో పైప్‌లైన్‌ల ద్వారా వాననీటిని తొట్టిలో నింపాలి. ఆ తొట్టిలో గులక రాళ్లు, నేలబొగ్గు, ఇసుకను ఉపయోగించి ఫిల్టర్ వ్యవస్థను రూపొందించుకోవాలి. ఆ ఫిల్టర్ నుంచి వచ్చే నీరు శుభ్రంగా ఉంటుంది. ఆ నీటిని తాగేందుకు, వంటకు ఉపయోగించవచ్చు. మిగిలిన నీటిని బావిలోకి విడిచి పెట్టాలి.

బయోగ్యాస్...

ఇంటి వద్దే బయోగ్యాస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా. ఈ బయో గ్యాస్‌కు పేడ అవసరమవుతుందని భావిస్తుంటారు. వాస్తవానికి ఇంటి వెనుక ప్లాంట్ ఏర్పాటు చేసిన తొలి దినాల్లో పేడను ఉపయోగించా. ఆ తర్వాత ఇంటిలోని కాయగూరల వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు వాడుతున్నా. రోజుకు సుమారు 3 నుంచి 4 కిలోల వ్యర్థాలను పడేస్తే చాలు గ్యాస్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు. అయితే బయోగ్యాస్ ద్వారా వంట చేయడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అందరూ అనుకుంటున్నట్లు ఎలాంటి దుర్వాసన వెలువడదు. సుమారు రూ.40వేలతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక నా ఇంటి మిద్దెపై ఏర్పాటు చేసిన కాయగూరల తోటలకు గాలి నుంచి నీటిని ఉత్పత్తి చేసే పరికరం ద్వారా సరఫరా చేస్తున్నా.



కుండీల్లో పెంచుతున్న పండ్ల మొక్కలు - మిద్దెపై గార్డెన్‌లో సురేష్

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్

వేలూరు, మార్చి 18: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపడతామని కలెక్టర్ సుబ్బలక్ష్మి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, కల్యాణ మండపాలు, లాడ్జీల యజమానులు, కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అనుమతి లేకుండా ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు ముద్రించరాదని, ప్రింటింగ్ చేసే వారి పేరు, చిరునామా ముద్రించాలన్నారు. అలాగే, రాజకీయ పార్టీలు కల్యాణ మండపాల్లో సమావేశాలు నిర్వహిస్తే అందుకు ముందుగా అనుమతి పొందాలన్నారు. లాడ్జీల్లో ఇతర రాష్ట్రాలు, జిల్లాల వారు బసచేస్తే ఆ వివరాలు సత్వరం ఎన్నికల అధికారులకు తెలియజేయాలన్నారు.

24న తిరుచ్చిలో ఈపీఎస్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

ప్యారీస్, మార్చి 18: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఈనెల 24న శ్రీకారం చుట్టనున్నారు. తిరుచ్చి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సమయపురం మారియమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ప్రచారం ప్రారంభిస్తారు. ఆయన ఈనెల 31వ తేది వరకు తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, తెన్‌కాశి, విరుదునగర్, కోయంబత్తూర్, రామనాథపురం, పుదుకోట, కడలూరు, శ్రీపెరుంబుదూర్, తేని, చిదంబరం, మైలాడుదురై నియోజకవర్గాల్లో తొలివిడత ప్రచారం చేస్తారు.

మూడు మద్యం దుకాణాల సీజ్

ఐసీఎఫ్, మార్చి 18: చట్ట వ్యతిరేకంగా బార్‌లో మద్యం సీసాలు దాచిన మూడు మద్యం దుకాణాలకు ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. ఏప్రిల్‌లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు పురస్కరించుకొని ఎన్నికల నిబంధనలు అమలుకు వచ్చాయి. తిరువళ్లూరు ఆర్డీఓ కర్పగం నేతృత్వంలో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఆవడి, పట్టాభిరాం ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. చెన్నై - తిరుత్తణి జాతీయ రహదారిలో ఉన్న మద్యం దుకాణాల్లో బార్లకు సరఫరా చేసేందుకు మద్యం సీసాలు దాచినట్లు ఫిర్యాదులందాయి. దీంతో ఆ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, 972 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని మూడు దుకాణాలకు సీలు వేశారు.

విషవాయువు సోకి కార్మికుడి మృతి

పెరంబూర్, మార్చి 19: డ్రైనేజీ తొట్టిను శుభ్రం చేయడానికి దిగిన కార్మికుడు విషవాయువు సోకి మృతి చెందాడు. కీలంబాక్కం నెర్కుంద్రం అంకాళమ్మన్ ఆలయ నగర్‌కు చెందిన దేవరాజ్ (52) కాలువలు శుభ్రం చేస్తుంటాడు. అతను అదే ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ డ్రైనేజీ తొట్టిను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన సమయంలో విషవాయువు సోకి ఊపిరాడక తొట్టిలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మరమలైనగర్ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని తొట్టి నుంచి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆరుగురికి గాయాలు

పెరంబూర్, మార్చి 18: ఫ్రీజర్ బాక్స్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరుగురు గాయపడ్డారు. కడలూరు జిల్లా కీలచెరువాయ్‌కి చెందిన మురుగానందం సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచారు. ఈ క్రమంలో, ఊహించని విధంగా షార్ట్‌సర్క్యూట్‌కు గురైన ఫ్రీజర్ బాక్స్ తాకిన కనకవల్లి, రాజమ్మాళ్, లలిత, గ్లోరి సహా ఆరుగురు విద్యుదాఘాతానికి గురయ్యారు. బంధువులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తమిళనాడు - పుదుచ్చేరి సరిహద్దుల్లో తనిఖీలు

అడయార్, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సరిహద్దుల్లో పారామిలిటరీ బలగాలు ఆదివారం వేకువజామున ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. ఈ సరిహద్దు ప్రాంతాల్లో సుమారు పదికిపైగా ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

చీరలు, నగదు స్వాధీనం

ప్యారీస్, మార్చి 18: ఈరోడ్‌లో కర్ణాటకకు చెందిన దంపతుల నుంచి 89 చీరలు, రూ.40 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం సాయంత్రం ఈరోడ్ సమీపంలో కారులో వచ్చిన కర్ణాటక దంపతుల నుంచి చీరలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు కర్ణాటక రాష్ట్రం కేఆర్ పురానికి చెందిన విద్యావతి, విజయేంద్రరావు అని, వీరి కుమారుడికి వచ్చే 1వ తేది వివాహం జరగనుందని, ఇందుకోసం చీరలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అయితే వీటికి సంబంధించిన రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.50 వేల కిరాణా సరుకులు...

తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలోని వేలంజేరిలో ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.50 వేల విలువైన కిరాణా సరుకులను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అరక్కోణం పార్లమెంటు పరిధి తిరుత్తణి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వేలంజేరిలో ప్రజలకు బియ్యం, పప్పు ధాన్యాలు, నూనె తదితర కిరాణా వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు తిరుత్తణి తహసీల్దార్ మదియళగన్‌కు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన ఆయన రెవెన్యూ అధికారులతో కలసి సంబంధిత గ్రామానికి వెళ్లి 15 బస్తాల్లో రూ.50 వేలు విలువ చేసే కిరాణా సరుకులను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల రాకను గమనించిన గ్రామస్తులు, పంపిణీదారులు పరారయ్యారు.

13కిలోల వెండి గొలుసులు...

అడయార్, మార్చి 18: తిరుప్పూరు జిల్లా తారాపురం సమీపంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 13 కిలోల వెండి గొలుసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని రిజర్వుడు నియోజకవర్గమైన తిరుప్పూరులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న వెండి గొలుసులను గుండం పోలీస్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.

పార్టీ జెండాలు, ప్రకటనల తొలగింపు

ప్యారీస్, మార్చి 18: రాజధాని నగరంలో ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 10,000 జెండాలు, ప్రకటనలను కార్పొరేషన్ సిబ్బంది తొలగిస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్, చెన్నై జిల్లా అధికారి రాధాకృష్ణన్ సోమవారం మీడియాకు వివరించారు. 14 చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి 24 గంటలు నలుగురు చొప్పున ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. నగరంలోని 200 వార్డుల్లో పెట్రోలింగ్ నిర్వహణకు 192 పోలీసు బృందాలు, 32 వీడియో కెమెరాలతో తనిఖీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

తల్లిదండ్రులు మాట్లాడలేదని విద్యార్థిని ఆత్మహత్య

ప్యారీస్, మార్చి 18: చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్ కోయిల్ సమీపంలోని తెల్లిమేడులో తల్లిదండ్రులు తనతో మాట్లాడడం లేదన్న విరక్తితో కళాశాల విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కరాటే మాస్టర్ బాబు కుమార్తె రక్షిణి (20) తాంబరంలో ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఈ నేపథ్యంలో, గత వారం స్నేహితులతో కలసి విహారయాత్రకు వెళ్లేందుకు తల్లిదండ్రులను కోరడంతో వారు నిరాకరించారు. అయినప్పటికీ, ఆమె తన స్నేహితులతో కలసి యాత్రకు వెళ్లింది. తమ మాట వినలేదని కుమార్తెతో రెండ్రోజులుగా మాట్లాడలేదు. దీంతో విరక్తి చెందిన రక్షిణి, ఆదివారం రాత్రి తన గదిలో ఉన్న ఫ్యానుకు ఉరేసుకుంది. పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

16 జిల్లాల్లో 152 ప్రాంతాల్లో కార్చిచ్చు

పెరంబూర్, మార్చి 18: రాష్ట్రంలోని అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవించడం అధికమవుతున్నాయి. భారత అటవీ పరిశోధన కేంద్రం అందజేసిన సమాచారం ప్రకారం, రాష్ట్రంలో దిండుగల్ జిల్లాల్లో 93 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడింది. అలాగే, సేలం జిల్లాలో 24, విల్లుపురంలో 9, కృష్ణగిరిలో 6, కన్నియాకుమారిలో 5, పెరంబలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో తలా 3, వేలూరులో 2, నీలగిరి, కోయంబత్తూర్, తిరుప్పూర్, తేని, మదురై, ధర్మపురి, రామనాథపురం, తిరువళ్లూర్ జిల్లాల్లో తలా ఒక ప్రాంతం అని మొత్తం 152 ప్రాంతాల్లో ఆదివారం కార్చిచ్చు సంభవించినట్లు తెలియజేసింది. కాగా, మంటలు ఆర్పే పనుల్లో తమ సిబ్బంది పాల్గొంటున్నట్లు అగ్నిమాపక శాఖ తెలియజేసింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు

పెరంబూర్, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయాలకు అధికారులు సీలు వేశారు. ఈ నేపథ్యంలో, మైలాడుదురై కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ శనివారం రాత్రి పక్క తలుపు గుండా తన కార్యాలయంలోకి ప్రవేశించి, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆ సమయంలో కార్యాలయంలో విందు ఏర్పాటుచేశారు. ఈ వ్యవహారంపై ఆదివారం ఉదయం పట్టమంగళం వీఏఓ మైలాడుదురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రకారం, ఎమ్మెల్యే రాజ్‌కుమార్, ఆయన మద్దతుదారులపై ఎన్నికల నిబంధనల అతిక్రమణ తదితర సెక్షన్లపై కేసు నమోదు చేశారు.

నామినేషన్లు ఎక్కడ దాఖలు చేయాలి?

ఐసీఎఫ్, మార్చి 18: నగరంలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో ఏఏ కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేయాలో చెన్నై కార్పొరేషన్ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19వ తేది జరగనుండగా, వివిధ పార్టీలు అభ్యర్థులను ఎంపిక చేయడంలో ముమ్మరంగా ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులు తాము పోటీ చేసే నియోజకవర్గాల్లో ఉన్న మండల కార్యాలయాల్లో నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ నేపథ్యంలో, నగరంలో దక్షిణ చెన్నై, మధ్య చెన్నై, ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గాల నామినేషన్లు ఈనెల 20 నుంచి 27వ తేది వరకు ప్రభుత్వ సెలవు దినాలు మినహా దాఖలుచేయవచ్చు. ఈ క్రమంలో, ఉత్తర చెన్నై నియోజకవర్గంలో పోటీ చేసేవారు ఎన్నికల నిర్వహణ అధికారి, డిప్యూటీ కమిషనర్, చెన్నై కార్పొరేషన్, నెం.62, బేసిన్ బ్రిడ్జి రోడ్డు, ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, చెన్నై-21లో, దక్షిణ చెన్నై నియోజకవర్గంలో పోటీ చేసేవారు నెం.115, డాక్టర్ ముత్తులక్ష్మి రోడ్డు, అడయార్, చెన్నై-20లో, మధ్య చెన్నై నియోజకవర్గంలో పోటీచేసేవారు నెం.36, పుల్లా అవెన్యూ, షేనాయ్‌నగర్, చెన్నై-30 అనే చిరునామాలో నామినేషన్ దాఖలు చేయాలని చెన్నై కార్పొరేషన్ తెలిపింది.

పాస్‌పోర్టుల దహనం: దంపతుల అరెస్ట్

పెరంబూర్, మార్చి 18: పాస్‌పోర్టులు దహనం చేసిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. మలేసియాలో నివసిస్తున్న ప్రీతిక తన తల్లిదండ్రులు చంద్రన్, వనితతో కలసి కొద్దిరోజుల క్రితం తిరుచ్చికి వచ్చారు. సమయపురం ఆలయం, అక్కరైపట్టి సాయిబాబా ఆలయాలను దర్శించిన వీరు, సిరుగానూర్ టోల్‌గేట్ సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేసి, కారైక్కుడికి బయల్దేరారు. ఆ సమయంలో చంద్రన్ తన బ్యాగును హోటల్‌లో మరచిపోయారు. వారు వెంటనే హోటల్‌కు వెళ్లి పరిశీలించగా బ్యాగు కనిపించకపోవడంతో, సమయపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోటల్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలించగా, పారిశుధ్య కార్మికురా లు అలమేలు, ఆమె భర్త అలెక్స్ బ్యాగు తీసుకోవడం గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, బ్యాగులో ఉన్న మలేసియా కరెన్సీ, 4 గ్రాములు బంగారు చైన్ తీసుకొని, అందులోని పాస్‌పోర్టులు తగులబెట్టినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దంపతులను అరెస్ట్ చేశారు.

కోవైలో ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, మార్చి 18: కోయంబత్తూర్ నగరంలోని రామనాథపురంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు సోమవారం ఉదయం బాంబు బెదిరింపు వచ్చింది. నగర పోలీస్ కంట్రోల్‌రూంకు ఫోన్ చేసిన వ్యక్తి ద్వారా ఈ బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో, అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకొని, పాఠశాల గదులు, ప్రాంగణాలకు క్షుణ్ణంగా తనిఖీ చేసి బాంబులు లేవని నిర్ధారించారు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని, తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. కోవైలో సోమవారం సాయంత్రం ప్రధాని మోదీ రోడ్ షో జరగనున్న నేపథ్యంలో, ఈ బాంబు బెదిరింపు కలకలం రేపింది.

జైల్లో సీసీ కెమెరాల ధ్వంసం

పెరంబూర్, మార్చి 18: కడలూరు కేంద్ర కారాగారంలో బంధించబడిన రౌడీ ఎన్నూర్ ధనశేఖరన్ తనకు నచ్చిన టీవీ ఛానల్ పెట్టలేదనే ఆగ్రహంతో జైలులోని సీసీ కెమెరాలు ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై జైలు సిబ్బంది ముదునగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, జైలు సిబ్బంది తనపై చేసిన ఫిర్యాదును వ్యతిరేకిస్తూ ఎన్నూర్ ధనశేఖరన్ సోమవారం ఉదయం నుంచి జైలులో నిరాహారదీక్ష చేపట్టినట్లు తెలిసింది.

గూండా చట్టం కింద 35 మంది అరెస్ట్

పెరంబూర్, మార్చి 18: నగరంలో వారం రోజుల వ్యవధిలో నేరాలకు పాల్పడుతున్న 35 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది. ఈ నెల 11నుంచి 17వ తేది వరకు జరిపిన తనిఖీల్లో 35 మందిని అరెస్ట్ చేయగా, వారిపై పలు కేసులుండడంతో గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆ ప్రకారం, ఈ ఏడాది జనవరి 1వ తేది నుంచి ఈ నెల 17వ తేది వరకు హత్య, హత్యాయత్నం, ప్రజా శాంతి భంగం, నగదు మోసం, చోరీ తదితరాలకు సంబంధించి 41 మందిని, గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 47 మంది, గుట్కా, పాన్ మసాలా తదితరాలు విక్రయిస్తున్న 14 మంది, సైబర్ నేరాలకు పాల్పడిన ఇద్దరు. మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురు, లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు, అత్యాచారం కేసుల్లో ముగ్గురు, రేషన్ సరకులు అక్రమ తరలింపు కేసులో ఒకరని గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

రూ.2 లక్షల వరకు అనుమతించాలి

- వ్యాపారుల సంఘ పేరవై అధ్యక్షుడు విక్రమరాజా

వేలూరు, మార్చి 18: వ్యాపారులు రూ.2 లక్షల నగదు తీసుకెళ్లేందుకు అనుమతించాలని తమిళనాడు వ్యాపారుల సంఘ పేరవై అధ్యక్షుడు విక్రమరాజా ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. సత్తువాచేరిలోని జీపీఎం కల్యాణ మండపంలో సోమవారం తమిళనాడు వ్యాపారుల సంఘం పేరవై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, బాలమురుగన్ అడిమై స్వామి సహా పలువురు హాజరయ్యారు. సమావేశంలో బాలమురుగన్ అడిమై స్వామికి 'తిరువళ్లూర్ పురస్కారం, లక్ష్మణన్, సౌకద్అలీకి 'ఎనిగ సెమ్మల్' పురస్కారాలు ప్రదానం చేశారు. సమావేశంలో తొలుత ఇటీవల మృతిచెందిన పేరవై మండల అధ్యక్షుడు కృష్ణన్‌కు నివాళి అర్పించారు. పేరవై జిల్లా సెక్రటరీ జ్ఞానవేలు, కోశాధికారి అరుణ్‌ప్రసాద్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం విక్రమరాజా విలేకరులతో మాట్లాడుతూ... వ్యాపార పన్ను శాఖ ద్వారా జీఎస్టీ వల్ల అర్హతలున్నా అపరాధం చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇది ఒకే పన్నుగా మార్చాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం సమర్పించామని తెలిపారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న విక్రమరాజా, నిర్వాహకులు

ఆ సంస్కృతి మనది కాదు

కె.భాగ్యరాజ్ ● విడుదలకు సిద్ధమైన 'కా'



'కా' ఆడియో రిలీజ్ దృశ్యం

పరభాషా చిత్రాలను, కళాకారులను కించపరిచేలా మాట్లాడే సంస్కృతి మనదికాదని, ప్రతి ఒక్కరినీ ఆదరించి అక్కున చేర్చుకునే మంచితనం కోలీవుడ్ సొంతమని సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ అన్నారు. ఆండ్రియా జెర్మయ్య ప్రధాన పాత్రలో నటించిన ఫారెస్ట్ థ్రిల్లర్ మూవీ 'కా'. షాలోమ్ స్టూడియోస్ బ్యానరుపై నిర్మాత జాన్ మ్యాక్స్ నిర్మించారు. నాంజిల్ దర్శకుడు. ఇతర పాత్రలను షమిల్ గౌస్, కమలేష్, అర్జున్‌సింగ్, అక్షిత, శ్రేషా, జెస్సీ రుక్మణి, రాజ్ మోహన్, నివాస్ బాబు, జెస్సికా, కార్తీక్‌రాజా, భానుశంకర్ తదితరులు పోషించారు. సోమవారం సాలిగ్రామంలోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో చిత్ర ఆడియో, ట్రైలర్ విడుదల వేడుక జరిగింది. సీనియర్ నటుడు కె.భాగ్యరాజ్, తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్, సీనియర్ నిర్మాత కె.రాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ మాట్లాడుతూ.... 'ఆండ్రియాతో పాటూ టెక్నీషియన్లు, ఇతర నటీనటులు ఎంతో కష్టపడి నటించినట్టు దర్శకుడు చెప్పారు. కొన్ని పాత్రలను నటీనటులు ఇష్టపడితే మరింత శ్రద్ధతో పనిచేస్తారు. ఆండ్రియా నటనతో పాటు దర్శకుడు చెప్పిన తీరు ఈ సినిమాను చూడాలన్న ఆసక్తి కలిగిస్తోంది. తమిళంలోకి వచ్చే తెలుగు డబ్బింగ్ చిత్రాలంటే నాకు ఎంతో ఇష్టం. విజయశాంతి ఫ్యామిలీ సెంటిమెంట్‌తో నటించేవారు. ఇపుడు ఆ తరహాలోనే ఆండ్రియా నటించిన 'కా' చిత్రం ఉంటుందని భావిస్తున్నా. ఫారెస్ట్ థ్రిల్లర్‌తో పాటు ఆండ్రియా నటనకు ఈ సినిమా విజయవంతమవుతుంది. బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన పరభాషా చిత్రాలను తమిళ ప్రేక్షకులు ఆదరిస్తారు. ఇటీవల వచ్చిన 'మంజుమల్ బాయిస్'ను ప్రముఖ రచయిత కింది స్థాయికి దిగజారి విమర్శలు చేయడం భావ్యం కాదు. తమిళ ప్రేక్షకులు, కళాకారులు అలాంటివారు కాదు. ఇతర భాషా చిత్రాలను, కళాకారులను కించపరిచేలా మాట్లాడే సంస్కృతి మనది కాదు. మంచి కథతో కూడిన పరభాషా చిత్రాలను తమిళ ప్రేక్షకులు ఆదరిస్తారు. తమిళ టెక్నీషియన్లకు ఇతర భాషల్లో మంచి గౌరవ మర్యాదలు ఇస్తున్నారు. అదేవిధంగా ఇతర భాషా టెక్నీషియన్లను కూడా తమిళ కళాకారులు అభినందించాలి. కేరళ టెక్నీషియన్లకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో వ్యక్తిగతంగా ఈ వ్యాఖ్యలు చేస్తున్నా' అని పేర్కొన్నారు. హీరోయిన్ ఆండ్రియా మాట్లాడుతూ... 'ఈ సినిమా కోసం ఎంతగానో శ్రమించాం. దట్టమైన అటవీ ప్రాంతంలో చిత్రీకరించాం. మీడియాతో పాటు ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు. ఈనెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది.

డబ్బింగ్ యూనియన్ అధ్యక్షుడిగా రాధారవి


రాధారవి

సౌత్ ఇండియా సినిమా అండ్ సీరియల్ డబ్బింగ్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడిగా సీనియర్ నటుడు రాధారవి మరోసారి ఎన్నికయ్యారు. ఈ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఇందులో మొత్తం సభ్యుల్లో 1017 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి రాధారవి, రాజేంద్రన్, షణ్ముగం పోటీపడ్డారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఇందులో రాధారవి 662 ఓట్లతో విజయం సాధించారు. రాజేంద్రన్‌కు 349 ఓట్లు, షణ్ముగంకు 36 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో రాధారవి భారీ ఓట్ల తేడాతో విజయం సాధించారు. దీంతో ఆయన మరోమారు అధ్యక్ష పదవిని చేపట్టారు. కాగా, రాధారవిపై గాయని చిన్మయి వంటి పలువురు కళాకారులు సంచలన ఆరోపణలు చేశారు. అలాగే, నిధుల దుర్వినియోగం చేసినట్టు పలువురు ఆరోపించారు. అయినప్పటికీ ఈ సంఘానికి జరిగిన ఎన్నికల్లో రాధారవి భారీ ఓట్ల మెజార్టీతో గెలుపొందడం గమనార్హం.

చిత్రజ్యోతి

'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మద్రాస్'

హైపర్‌లూప్ మూవీ


అంజలి నాయర్

భరత్, షాన్, రాజాజీ, అభిరామి, అంజలి నాయర్, పవిత్ర లక్ష్మి ప్రధాన పాత్రల్లో హైపర్ లూప్ బాణీలో థ్రిల్లర్ మూవీ తెరకెక్కనుంది. ఫ్రైడే ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై కెప్టెన్ ఎంపీ ఆనంద్ నిర్మాణంలో బాలా డ్రీమ్ హౌస్ హరూన్, పీజీఎస్ ప్రొడక్షన్స్ అధినేత పీజీఎస్ సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రానికి ప్రసాద్ మురుగన్ దర్శకుడు. 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మద్రాస్' అనే పేరును ఖరారు చేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు ప్రసాద్ మురుగన్ మాట్లాడుతూ... 'ఒక వస్తువు మనిషి చేతికి వచ్చినపుడు సందర్భాన్నిబట్టి దాన్ని అతను మంచి కోసం లేదా చెడు కోసం ఉపయోగిస్తుంటాడు. అలా అనుకోకుండా నలుగురికి తుపాకీ దొరుకుతుంది. ఆ తుపాకీతో సైద్ధాంతిక రాజకీయాలు, వాణిజ్య ప్రకటనలతో విభిన్న వర్గాల ప్రజల జీవితాలను ఎలా మారుస్తుందన్నదే ఈ చిత్ర కథ. ఇప్పటివరకు పూర్తి చేసిన షూటింగ్ చాలా బాగా వచ్చింది. చివరి దశ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. భరత్, షాన్ రాజాజీ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. కాళిదాస్, కన్నప్ ఛాయాగ్రహణం అందించగా, జోస్ ఫ్రాంక్లిన్ సంగీతం సమకూర్చుతున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌ను చెన్నైలో జరుపుకుంటోంది' అని వివరించారు.

22న 'బాస్ ఎన్‌గిర భాస్కరన్' రీ రిలీజ్


'బాస్ ఎన్‌గిర భాస్కరన్'లో ఆర్య - నయనతార

ఎం.రాజేష్ దర్శకత్వంలో వచ్చి ఘనవిజయం సాధించిన చిత్రం 'బాస్ ఎన్‌గిర భాస్కరన్'. ఆర్య, నయనతార హీరోహీరోయిన్లు. యువన్ శంకర్ రాజా సంగీతం. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో వచ్చిన ఈ చిత్రం హీరో ఆర్య కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ గా నిలిచింది. యువన్ అందించిన అద్భుతమైన సంగీతంలో ఈ మూవీలోని పాటలన్నీ సూపర్‌హిట్. నేటికీ ప్రేక్షకుల మనసుల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయాయి. ఇటీవల ఎన్నో విజయవంతమైన చిత్రాలు రీ రిలీజ్‌కు నోచుకుంటున్నాయి. ఆ కోణంలోనే ఈ చిత్రం కూడా ఈనెల 22న విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకాన్ని దర్శక నిర్మాతలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం దర్శకుడు రాజేష్.. జయం రవి హీరోగా 'బ్రదర్'ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం చివరి దశ నిర్మాణంలో ఉంది. ఆ తర్వాత అధర్వ - అదితి శంకర్ జంటగా మరో చిత్రాన్ని రాజేష్ తెరకెక్కించనున్నారు.

పళని ఆలయంలో పంగుణి ఉత్తిరం ఉత్సవాల ప్రారంభం


పళని ఆలయంలో ధ్వజారోహణం - ఇష్టదేవేరులతో ముత్తుకుమారస్వామి

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న పళని దండాయుధపాణి ఆలయంలో సోమవారం ఉదయం పంగుణి ఉత్తిరం ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో యేటా తైపూస వేడుకల సందర్భంగా భక్తులు పాదయాత్రలు చేపట్టడం, పంగుణి ఉత్తిరం వేడుకల్లో తీర్థకావళ్ల సమర్పించడం ఆనవాయితీ. వేసవికాలమైన పంగుణి, చిత్తిరై మాసాల్లో పళని దండాయుధపాణి స్వామిని చల్లబరిచే రీతిలో కొడుముడి కావేరి వాగు నుంచి భక్తులు తీర్థకావళ్ల మోసుకొచ్చి ఆ జలాలతో అభిషేకాలు నిర్వహిస్తారు. ఆ మేరకు ఈ యేడాదికి సంబంధించి పంగుణి ఉత్తిరం ఉత్సవాలు పళని పర్వతాలయ అనుబంధ ఆలయంగా ఉన్న తిరుఆవినకుడిలో ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి గ్రామ శాంతి, వాస్తుశాంతి పూజలు, అగస్త్యేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఉదయం తిరుఆవినకుడి ఆలయంలో వినాయకుడి పూజలు, పుణ్యాహవాచనం జరిపారు. ఆ తర్వాత కోడిపుంజు, నెమలి చిత్రాలు ముద్రించి ఉన్న పతకాన్ని ధ్వజస్తంభం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. ముత్తుకుమారస్వామి, వళ్లీదేవసేనకు పాలు, పండ్లు, పన్నీరు, చందనం, పంచామృతం సహా 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకొచ్చిన తీర్థకావళ్లలోని జలంతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత ఇష్టదేవేరుల సమేతంగా స్వామివారు ధ్వజస్తంభ మంటపం వద్ద వేంచేశారు. ఆ సందర్భంగా అస్త్రదేవుడు, వినాయకుడి విగ్రహాల ఎదుట మయూర యాగం, వాద్య పూజలు జరిగాయి. ఉదయం 9.10 గంటలకు వేద మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధానార్చకులు ధ్వజారోహణం చేశారు. అప్పటికే వేకువజాము నుంచి పెద్దసంఖ్యలో గుమికూడిన భక్తులంతా 'వెట్రివేల్ మురుగనుక్కు. హరోం హర' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆ తర్వాత ఓదువార్లు తిరుమురై పఠించారు. ధ్వజస్తంభానికి, ముత్తుకుమారస్వామి, వళ్లీ దేవసేనకు దీపారాధన గావించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం, 24న రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

తిరుచెందూరులో ఓపీఎస్ ప్రత్యేక పూజలు


స్వామివారి దర్శనానికి వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) సోమవారం ఉదయం తిరుచ్చెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో ప్రత్యేక పూజలు, శత్రుసంహార యాగం నిర్వహించారు. దైవదర్శనం కోసం ఆయన ఆదివారం సాయంత్రం ఆయన తిరుచ్చెందూరుకు చేరుకుని అక్కడి ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో బసచేశారు. సోమవారం వేకువజామున ఆలయానికి వెళ్లి గర్భాలయంలో విశ్వరూప దర్శనం చేశారు. ఆ తర్వాత శత్రుసంహారమూర్తి సన్నిధి వద్ద ప్రత్యేక పూజలు, యాగం నిర్వహించారు. మూలవిరాట్టుకు జరిగిన ప్రత్యేక అభిషేకంలో పాల్గొన్నారు. ఈ పూజలకు కాషాయ ధోవతి కట్టుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలని దేవుడిని వేడుకున్నట్టు చెప్పారు.

మూడోసారి కూడా ప్రధానిగా మోదీ

● టీటీవీ దినకరన్

అడయార్, మార్చి 18: రానున్న సార్వత్రిక ఎన్నికల తర్వాత నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి అవుతారని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అభిప్రాయపడ్డారు. ఇదే విషయంపై ఆయన సోమవారం తిరువణ్ణామలైలో విలేకరులతో మాట్లాడుతూ, భారతీయ జనతాపార్టీతో కలిసి తమ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. బీజేపీకి భేషరతు మద్దతు ఇచ్చామన్నారు. పదేళ్ళుగా అధికారంలో ఉన్న మోదీ... ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావులేకుండా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రపంచ దేశాలకు దిక్సూచిగా భారత్‌ను రూపొందించారని ఆయన చెప్పారు.

కమలంతో పీఎంకే దోస్తీ!

అడయార్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు పీఎంకే ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్ సూచన ప్రాయంగా వెల్లడించారు. సేలంలో జరగనున్న ఎన్డీయే బహిరంగ సభల్లో ప్రధాని నరేంద్రమోదీతో పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి సమావేశమై పొత్తుపై చర్చించి స్పష్టత ఇస్తారని ఆయన వెల్లడించారు. విల్లుపురం జిల్లా దిండివనం తైలాపురం గార్డెన్‌లో సోమవారం జరిగిన పీఎంకే ఉన్నతస్థాయి సమావేశంలో లోక్‌సభ ఎన్నికల పొత్తుపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే కూటమిలో చేరాలని చర్చించలేదన్నారు. బీజేపీతో చేతుల కలపాలని పార్టీ అగ్రనేతలు రాందాస్, అన్బుమణి రాందాస్ నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కూటమిలో కేటాయించే సీట్లు, నియోజకవర్గాల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

35 జిల్లాల్లో తగ్గిన భూగర్భ జలమట్టాలు

పెరంబూర్, మార్చి 18: నీటి వినియోగం పెరగడంతో రాష్ట్రంలోని 35 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గాయి. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర జలవనరుల పరిశోధన కేంద్రం పనిచేస్తోంది. ఈ కేంద్రం ప్రతి నెలా భూగర్భ జలమట్టాలను పరిశీలిస్తుంది. అందుకోసం చెన్నై మినహా మిగతా జిల్లాల్లో పరిశోధన బావులు ఏర్పాటు చేశారు. గత ఫిబ్రవరి గణాంకాల ప్రకారం, కళ్లకుర్చి, విల్లుపురం జిల్లాలు మినహా 35 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు మీటరు తగ్గినట్లు తెలిసింది. నీటి వినియోగం పెరగడంతో వేసవి ఎండలకు ముందే భూగర్భ జలమట్టాలు తగ్గడంతో, రాబోయే నెలల్లో తాగునీటి కొరత ఏర్పడే అవకాశముందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఐదు జలాశయాల్లో 71.91 శాతం నీటిమట్టాలు


పెరంబూర్, మార్చి 18: నగరానికి తాగునీరు అందించే ఐదు ప్రధాన జలాశయాల్లో 71.91 శాతం నీటిమట్టాలున్నాయి. 3,300 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో ప్రస్తుతం 2,759 మిలియన్ ఘనపుటడుగుల నీరు ఉంది. నగరానికి తాగునీటి అవసరార్థం 159 ఘనపుటడుగులు విడుదల చేస్తుండగా, జలాశయంలోకి 720 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. చోళవరం జలాశయం పూర్తి సామర్థ్యం 1,081 మిలియన్ ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 280 మిలియన్ ఘనపుటడుగుల నీటి నిల్వలుండగా, పుళల్ జలాశయానికి 535 ఘనపుటడుగుల నీటిని తరలిస్తున్నారు. 500 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన కన్నన్‌కోట తేర్వాయ్ కండిగై జలాశయంలో 449 మిలియన్ ఘనపుటడుగుల నీరు ఉంది. ఆ ప్రకారం చెంబరంబాక్కం జలాశయంలో 81.43 శాతం, పుళల్‌లో 83.61 శాతం, పూండిలో 61.84 శాతం, చోళవరంలో 25.0 శాతం, కన్నన్‌కోట జలాశయంలో 89.9 శాతం నీటి నిల్వలున్నాయి. నగరానికి తాగునీరు అందించే ఐదు జలాశయాల సామర్థ్యం 11.757 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.454 టీఎంసీలు నీటి నిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

తాంబరంలో 'ఎఫ్ఐటీ59' ఫిట్‌నెస్ స్టూడియో



చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తూర్పు తాంబరం భరత మాత వీధిలో 'ఫిట్59 ఫిట్‌నెస్ స్టూడియో' ఏర్పాటైంది. దీన్ని ప్రముఖ నటుడు హరీష్ ఉత్తమన్ లాంఛనంగా ప్రారంభించారు. 700 చదరపు అడుగుల వైశాల్యంలో పవర్‌లిఫ్టింగ్ సదుపాయంతో అంతర్జాతీయ స్థాయి ఉపకరణాలతో ఈ స్టూడియో ప్రారంభమైంది. గుర్తింపు పొందిన శిక్షకులు, పౌష్టికాహార నిపుణులు, ఫిజియోథెరపీ, గ్రాస్ ఫిట్, పవర్ లిఫ్టింగ్, జుంబా, యోగా తదితర శిక్షణలు అందించబడతాయని నిర్వాహకులు తెలిపారు. రక్తపరీక్షల ఆధారంగా వ్యాయామ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

అధికారుల వాహనాలకు 360 డిగ్రీలు వీక్షించే సోలార్ సీసీ కెమెరాలు


అధికారుల వాహనాలకు ఏర్పాటుచేసిన సోలార్ సీసీ కెమెరాలు

పెరంబూర్, మార్చి 18: మదురైలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల వాహనాలకు 5జీ సెల్‌ఫోన్ సేవలతో పాటు, 360 డిగ్రీల కోణంలో సౌరశక్తితో పనిచేసే అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాహనాలు వెళ్లే ప్రాంతాల్లో జరుగుతున్న తనిఖీలు, సభలు, ప్రచార కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు తదితరాలను ఉన్నతాధికారులు కంట్రోల్ రూం నుంచే వీక్షించి, అందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయనున్నారు.

అల్ప సంఖ్యాక వర్గాలకు న్యాయం చేయాలి

● కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సీఎంకే రెడ్డి డిమాండ్



సీఎంకే రెడ్డి, కిషోర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 18: రాష్ట్రంలోని అల్పసంఖ్యాక వర్గాలకు న్యాయం చేయాలని లింగ్విస్టిక్ మైనార్టీస్ ఫోరం ఆఫ్ తమిళనాడు (లిమ్‌ఫాట్), అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు (ఏఐటీఎఫ్) ఆచార్య డాక్టర్ సీఎంకే రెడ్డి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కొరట్టూరు మోహన్ గార్డెన్స్‌లో ఏఐటీఎఫ్, లిమ్‌ఫాట్, నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'వాయిస్ ఆఫ్ లింగ్విస్టిక్ మైనార్టీస్ ఆఫ్ తమిళనాడు' అనే అంశంపై ఆదివారం సాయంత్రం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభించిన సీఎంకే రెడ్డి మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే తమిళనాడులో అల్పసంఖ్యాక వర్గాలకు తగిన గుర్తింపు వచ్చిందన్నారు. తాము తమిళ భాషకు వ్యతిరేకం కాదని, అయితే మాతృభాష తెలుగు, మలయాళం, కన్నడం, ఉర్దూలో చదువుకొనేందుకు అభ్యంతరం తెలియజేయరాదని, అదే విధంగా విద్యతో పాటు సమానంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా మనిషి మ్యాన్‌హోల్‌లో దిగి పనిచేయడం రాష్ట్రంలో ఇప్పటికీ పలు జిల్లాల్లో కొనసాగుతోందని, టెక్నాలజీ వేగంగా పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా విషవాయువు సోకి మరణిస్తున్న వారిలో ఆదిఆంధ్రులు, అరుంధతీయులే అధికంగా ఉన్నారని అందువల్ల రాష్ట్రప్రభుత్వం మ్యాన్‌హోల్ మరణాలు నివారించేలా ఎన్నికల సమయంలోనైనా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే పార్టీలు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం బతుకుతుందని, ప్రతి ఒక్కరు తమ భవిష్యత్తు కోసం తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించాలని, నిస్వార్థపరులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సీఎం కిషోర్, ఏఐటీఎఫ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.నందగోపాల్, ట్రస్టీ డాక్టర్ ఎన్.నాగభూషణం సదస్సు లక్ష్యాలు వివరించారు. ఈ సదస్సులో ప్రముఖ జర్నలిస్ట్ ఆర్.రంగరాజ్ పాండే, నటుడు మెర్క్యురీ సత్య, బీజేపీ కార్యదర్శి వినోద్ సెల్వం, ఏఐటీఎఫ్ కోశాధికారి కేవీ జనార్దనం, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు లయన్ జి.మురళి, ఎన్.నిర్మల్ చందర్, మోహన్‌నాయుడు, పోరూరి సుబ్రమణ్యం సహా పలు తెలుగు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు కోసం రూ.750 కోట్లివ్వండి

● ఈసీ సత్యప్రద సాహు వినతి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రద సాహు

అడయార్, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఖర్చు కోసం రూ.750 కోట్లు కోరినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ తెలిపారు. రాష్ట్రంలో ఏప్రిల్ 19న ఒకే విడతలో పోలింగ్, భద్రత తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం సాయంత్రం సచివాలయ ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయన మీడియాకు వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని, అదేవిధంగా అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని చెప్పారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో పాటు శాంతియుతంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతను కల్పిస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు పారామిలిటరీ, సీఐఎస్ఎఫ్ బలగాలను మోహరిస్తామని తెలిపారు.


సోమవారం చెన్నైలో జరిగిన ఎండీఎంకే సమావేశంలో ప్రసంగిస్తున్న ఆ పార్టీ అధినేత వైగో